కుంచె పట్టి.. రంగులద్ది

- మెడికల్ హాస్టల్ ప్రాంగణాన్ని తీర్చిదిద్దిన వైద్య విద్యార్థినులు
- వార్షికోత్సవానికి అందంగా ముస్తాబు



తదేక దీక్షతో సందేశాత్మక చిత్రాలు గీస్తున్న వైద్య విద్యార్థినులు



ఎప్పుడో చిన్నప్పుడు పుస్తకాల్లో వేశాం.. ఇప్పుడు మరలా మన హాస్టల్ ప్రహరీపై వేస్తున్నాం

దాబాగార్డెన్స్: ఏదైనా మన సొంతం అనుకుంటే.. దానిని పువ్వులా పెట్టుకుని చూసుకుంటాం. ఐదేళ్ల పాటు చదివే సరస్వతీ నిలయంలో వేలాది మంది విద్యార్థులు ప్రతి ఏటా విడుదలవుతుంటారు. కొత్త వారు చేరుతుంటారు. ఐదేళ్ల పాటు విద్యన భ్యసించిన ఆ ప్రాంగణం మనదే అన్నట్టు ఫీలవుతుంటాం. ఇది మన హాస్టల్.. ఇది మన కాలేజీ.. అనుకొని గొప్పగా చూసుకుంటాం. ఈ విషయంలో ఆంధ్రా మెడికల్ కళాశాల హాస్టల్ విద్యార్థినులు ఒకడుగు ముందుకేశారు. వైద్య విద్యనభ్యసిస్తున్న హాస్టల్ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా హాస్టల్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నారు. పాడై దుమ్ము పట్టిన హాస్టల్ ప్రహరీని వారు పరిశుభ్రం చేశారు. నీటితో కడిగారు. సున్నం (వైట్ సిమెంట్) పూసారు. అక్కడితో ఆగలేదు. దాదాపు ప్రహరీ మొత్తం సందేశాత్మక చిత్రాలతో అందంగా చిత్రిస్తున్నారు. వైద్య వృత్తి కోసం.. ప్రకృతి.. ఆర్మీ.. పర్యావరణ హితం.. తదితర చిత్రాలను వైద్య విద్యార్థినులు చిత్రీకరిస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. విశేషమేమిటంటే.. ఈ చిత్రాల్లో మంచి చిత్రాలకు వార్షికోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నారు.



మెడికల్ హాస్టల్ ప్రహరీకి పెయింట్ వేసి బొమ్మలు గీస్తున్న విద్యార్థినులు

పూర్ణామార్కెట్ ఘటనపై కదిలిన పోలీసు యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ : ఎట్టకేలకు పూర్ణామార్కెట్‌లో దుకాణాల వ్యవహారాలపై పోలీసు యంత్రాంగం కదిలింది. గురువారం సాక్షి దినపత్రికలో 'రోడ్డెక్కిన పూర్ణామార్కెట్' శీర్షికతో వార్త ప్రచురితమైన సంగతి విదితమే. దీనిపై పోలీసు యంత్రాంగం పూర్ణామార్కెట్‌కు చేరుకుని పరిశీలించింది. డీసీపీ ఆనందరెడ్డి వ్యాపారులతో చర్చించారు. శాంతి, భద్రతలకు విఘాతం కలగకుండా ఉండాలని, రహదారులపై దుకాణాలు ఏర్పాటు చేయరాదన్నారు. ప్రజలు, వాహన చోదకులకు ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. సమస్యలేమైనా ఉంటే లిఖితపూర్వకంగా తెలియజేస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. హార్బర్ ఏసీపీ శిరీష, వన్‌టౌన్ సీఐలు పార్వతమ్మ (శాంతి భద్రతలు), తులసీదాస్ (ట్రాఫిక్), ఎస్ఐలు భాస్కరరావు, జోగిరాజు, జీవీఎంసీ టౌన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న డీసీపీ ఆనందరెడ్డి

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐ ఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

క్లుప్తంగా

రాహుల్‌పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహారాణిపేట : రాహుల్‌గాంధీపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవింద్ హెచ్చరించారు. కలెక్టరేట్ ఎదుట జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశ సంపదను అదానీకి కట్టబెట్టే ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందన్నారు. దేశంలోని కేంద్ర సంస్థలన్నింటినీ అతనికి అప్పజెప్పి డబ్బు వెదజల్లడం ద్వారా మళ్లీ అధికారంలోకి రావాలని బీజేపీ కలలు కంటోందని ఆరోపించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేశారు. కాకినాడ చిన్నబాబు, బమ్మిడి గంగాధర్, పెద్దాడ ఘననాగపాణి, వేగి వెంకటేష్, ఎం.లక్ష్మి, సోడదాసు సుధాకర్, లక్కరాజు రామారావు, సుధాకర్ దాకవరపు, కస్తూరి వెంకటరావు, గాదం మహేష్, జెర్రి పోతుల ముత్యాలు, రామదాసు ఎల్లయ్య, సత్యనారాయణ, ఈశ్వరరావు, లాయర్ శ్రీనివాస్, పెద్దాడ చరణ్ పప్పు, సతీష్ కుమార్, పెద్దాడ సుజాత, ఆషారాణి, చెన్నా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



సందర్శకులకు అగ్నిమాపక యంత్రాల పనితీరును వివరిస్తున్న ఏడీఎఫ్‌వో రమణ

అల్లిపురం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం సూర్యాబాగ్ అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన యంత్రాల ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఏడీఎఫ్‌వో ఆర్‌వీ రమణ ఆధ్వర్యంలో సిబ్బంది అగ్నిమాపక యంత్రాలు, వాటి ఉపయోగాలు, పనితీరును సందర్శకులకు వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు, సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్‌లు టి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాసరావు, కె.కృష్ణప్రసాద్, డీఎల్‌వోపీలు ఏకే బాబు, సీహెచ్ కనకరాజు, పి.రవికుమార్, ఫైర్‌మెన్లు పి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, ఎస్.రాజునాయుడు, ఎం.రామ్‌కుమార్, ఎస్.కె.సుల్తాన్, ఎ.కృష్ణ, ఎండీ సుబాన్, ఆర్.శంకరరావు, హోంగార్డులు కె.బాలాజీరెడ్డి, జి.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో సేవా స్ఫూర్తి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని పెంచేలా ఎన్ఎస్ఎస్ నిలుస్తుందని ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వర్సిటీకి దగ్గరలో ఉన్న రెల్లివీధి ప్రాంతాన్ని దత్తత తీసుకుని వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎన్ఎస్ఎస్‌లో యువత భాగస్వాములై విభిన్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ మాట్లాడుతూ విద్యార్థులను భాగస్వాములను చేస్తూ 7 రోజుల పాటు 7 ప్రత్యేక కార్యక్రమాలను చేపడతామన్నారు.

ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే వాసుపల్లి రంజాన్ కానుక

దాబాగార్డెన్స్: పేద ముస్లిం సోదర కుటుంబాలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రంజాన్ కానుక అందజేశారు. 39వ వార్డు షాదీఖానాలో గురువారం 30 ముస్లిం సోదర కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2500 చొప్పున రూ.75 వేలు తన సొంత నిధుల నుంచి ఇచ్చారు. రంజాన్ కానుక నగదు రూపంలో అందజేయడంతో ముస్లిం సోదరుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ముందుగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. తనకు ముస్లిం సోదరులతో విడదీయరాని బంధం ఉందన్నారు. తాను కోటవీధిలో పుట్టి పెరిగానని, ఇక్కడ ముస్లిం సోదరులతో బంధం తన చిన్న నాటి నుంచి ముడిపడి ఉందన్నారు. హిందూ, ముస్లిం భాయి భాయి అంటూ మత సామరస్యానికి ప్రతీకగా విశాఖ పాతనగరం నిలుస్తుందని చెప్పారు. చిన్న నాటి నుంచి అలాగే కలిసి మెలిసి పెరిగామంటూ చిన్నప్పటి జ్ఞాపకాలు నెమర వేసుకున్నారు. ముస్లిం సోదరులకు తన వంతు సహాయ సహకారాలు అందివ్వడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ముస్లిం సోదరుల అభ్యున్నతికి తన వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అందుకే ముస్లిం సోదరుల సమస్యల పరిష్కారానికి ప్రతి శుక్రవారం ముస్లిం ప్రజాదర్బార్ నిర్వహించడం జరుగుతుందని, ముస్లింలకు ఏ సమస్య వచ్చినా తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని మరోసారి తెలిపారు. ఇక్కడ మసీదు నిర్మించినప్పుడు తాను ఇటుకలు మోసిన విషయాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గుర్తు చేసుకున్నారు. అల్లా కరుణ, ముస్లిం సోదరుల అండతో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచానని, రానున్న ఎన్నికల్లో మరోసారి తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. మీ అందరికి సేవ చేసుకునే భాగ్యాన్ని కల్పించాలని ముస్లిం సోదరులను కోరగా, వాసుపల్లి గణేష్‌కుమార్ మాటలకు ఉత్తేజవంతులైన ముస్లిం సోదరులు ఎమ్మెల్యేను అభినందిస్తూ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు సౌత్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, స్టేట్ మైనార్టీ డైరెక్టర్ సబీరా బేగం, శ్రీ కనక మహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, 31వ వార్డు కార్పొరేటర్ బిపిన్‌కుమార్‌జైన్, 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు బాబ్జి, కమాలుద్దీన్, సలీం, అఫ్సర్‌ఖాన్, ఆదిల్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలకు రంజాన్ కానుకగా ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

ఘనంగా ఏఐబీఈఏ 78వ వ్యవస్థాపక దినోత్సవం



జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న వసంతరావు

దాబాగార్డెన్స్: ఏఐబీఈఏ 78వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయ ప్రాంగణంలో గల పంజాబ్ నేషనల్ బ్యాంక్ వద్ద జరిగింది. విశాఖపట్నం బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఆర్. వసంతరావు, పలువురు నాయకులు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల జీత భత్యాలు, స్థితిగతులు మెరుగుపడడానికి ఏఐబీఈఏ ఎన్నో పోరాటాలు చేసి సాధించిందన్నారు. ఏఐబీఈఏ వ్యవస్థాపకుడు పర్వాన, ప్రభత్కర్, తారకేశ్వర్, చక్రవర్తిలను స్మరించుకుని వారికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం షటిల్ బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కమల్, శ్రీనివాసకుమార్, ఆడారి శ్రీను, రమేష్, శ్రీనివాసరావు, ఈశ్వర్, వైశాలి, స్వామి, సుజాత తదితర బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ అధికారులు

మహారాణిపేట : రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది, అధికారులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం అన్నారు. గురువారం కేజీహెచ్ సమీపంలో గల జాలరిపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. కోడిగుడ్ల నాణ్యత, బరువును గమనించారు. బాలామృతం, ఇతర వస్తువులను సక్రమంగా అందిస్తున్నదీ లేనిదీ కేంద్రంలోని పిల్లల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషక పదార్థాలతో కూడుకున్న సమతుల్య పౌష్టికాహారం అందించాలని సూచించారు. ప్రభుత్వం బాలింతలు గర్భిణులు, పిల్లలకు అధిక ప్రాధాన్యతనిస్తుందని, బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయిస్తుందన్నారు. బాల్యవివాహాలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పోర్టిఫైడ్ రైస్‌ను లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురి కాకుండా ఆయా కాలాల్లో లభించే కూరగాయలు, పండ్లు విరివిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్తు'

అల్లిపురం: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం 33వ వార్డులో జోరుగా కొనసాగుతోంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని ఇంటింటి ప్రచారం కొనసాగిస్తున్నారు. దీంట్లో భాగంగా కుమ్మరవీధి సచివాలయం కన్వీనర్ పోలవరపు పావని ప్రసాద్, గృహసారథులు బంగారుమెట్ట కాలనీలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేద, మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని వారికి ప్రయోజనకరంగా ఉండే పథకాలను అందిస్తున్నారని, పథకాల వలన ప్రతి ఒక్కరు లబ్ధి పొందుతున్నారని వివరించారు. గృహస్తులతో మిస్డ్ కాల్ చేయించి, పార్టీకి ప్రజలు స్వచ్ఛందంగా తమ వంతు మద్దతు తెలియజేస్తున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు రంథి గోపీకృష్ణ, పోలవరపు ప్రసాద్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న రంథి గోపీకృష్ణ, పోలవరపు పావని ప్రసాద్

వార్డులన్నీ పరిశుభ్రంగా ఉండాలి

జగదాంబ: జీవీఎంసీ జోన్ పరిధిలోని వార్డులన్నీ పరిశుభ్రంగా ఉండాలని జోన్–4 కమిషనర్ కె.శివప్రసాద్ అన్నారు. గురువారం ఆయన జోన్ పరిధిలోని 12 వార్డులను పరిశీలించారు. 31వ వార్డు కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయాన్నే రోడ్లు, కాలువలు, గెడ్డలు, సులభ్ కాంప్లెక్స్‌లు పరిశుభ్రం చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులందరూ విధిగా జీవీఎంసీ ఇచ్చిన యూనిఫామ్ ధరించాలన్నారు. అనంతరం సిబ్బంది హాజరును స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

పెనాల్టీల నుంచి ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలి

మహారాణిపేట : బ్యాంకులు పెనాల్టీలు, చార్జీల నుంచి ఉద్యోగులు, పెన్షనర్లకు మినహాయింపు ఇవ్వాలని ఉద్యోగ సంఘాల కార్యాచరణ సమితి (అమరావతి) జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రదర్శన జరిగింది. కలెక్టరేట్ ఆవరణలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట జరిగిన ప్రదర్శనలో జేఏసీ చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ బ్యాంకులు విధించే పెనాల్టీల వల్ల ఉద్యోగుల సిబిల్ స్కోరు తగ్గిపోతుందని, దీని నుంచి ప్రభుత్వ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చి, అదనపు భారాన్ని తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీ రమేష్, కోశాధికారి రవిశంకర్, జేఏసీ కో చైర్మన్ నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి మహేష్, ఉద్యోగులు, పెన్షనర్లు హాజరయ్యారు. అనంతరం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.



బ్యాంకు చీఫ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కలెక్టరేట్‌లో చలివేంద్రం ఏర్పాటు

మహారాణిపేట : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ, విశాఖ డెయిరీ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు ముందు కొచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వేసవికాలం అంతా చలివేంద్రం నిర్వహిస్తారని అన్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి 100 నుంచి 200 మంది అర్జీదారులు వస్తారని, వారికి భోజనం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో కూడా చలివేంద్రం ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. చలివేంద్రం ఏర్పాటుకు సహకరించిన రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విశాఖ డెయిరీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ ఎస్‌కేఎల్ రావు, విశాఖ డెయిరీ మార్కెటింగ్ మేనేజర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో జేసీ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

పుస్తకాల బహూకరణ

ఏయూ క్యాంపస్: ఏయూ రాజనీతి, ప్రభుత్వ పాలన శాస్త్రం విభాగానికి డాక్టర్ సులేమాన్ పలు పుస్తకాలు బహూకరించారు. విభాగ విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయుక్తంగా రూ.3 వేలు విలువ చేసే పుస్తకాలను గురువారం విభాగాధిపతి డాక్టర్ జి.వీర్రాజుకు అందజేశారు. డాక్టర్ సులేమాన్ విభాగంలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు.

పాదయాత్ర, వక్తృత్వ పోటీలు రేపు

సీతంపేట: ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఈ నెల 22న పాదయాత్ర, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎస్.ఆర్.వర్మ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శనివారం ఉదయం 6 గంటలకు ఆర్కే బీచ్ నుంచి ఏయూ కన్వెన్షన్ హాల్ వరకు పాదయాత్ర, ఉదయం 8.30 గంటలకు ఏయూ సోషల్ అండ్ సైన్స్ డిపార్ట్‌మెంట్ నాగార్జున హాస్టల్ ఎదుట వక్తృత్వ పోటీలు జరుగుతాయన్నారు. డిగ్రీ విద్యార్థినీ విద్యార్థులకు నాలుగు విభాగాల్లో 'పక్షులు అంతరించిపోకుండా రక్షించడం', 'దేవాలయాల్లో పాలిథిన్ వాడకం–నిర్మూలన', 'మన భూమి–మన బాధ్యత'లో భాగంగా 'భావితరాల కోసం కాలుష్యాల నుంచి భూగ్రహాన్ని రక్షించడం –వాతావరణంలో మార్పులు', 'ఈ తరం ప్రజలకు సేంద్రియ వ్యవసాయం–చిరుధాన్యాలపై అవగాహన' వంటి అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు ఇస్తామన్నారు. నాలుగు విభాగాల్లో బహుమతులు సాధించిన విజేతలకు మళ్లీ వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.6 వేలు అందజేస్తామని తెలిపారు. అదే రోజు సాయంత్రం ఏయూ కన్వెన్షన్ హాల్‌లో త్రిదండి చినజీయర్ స్వామి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. పాల్గొన దలచిన వారు 99898 19666, 73374 11732 నంబర్లలో సంప్రదించాలని వర్మ కోరారు. సమావేశంలో వికాస తరంగిణి కార్యదర్శి నారాయణరెడ్డి, కోశాధికారి రామానుజం పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సంస్థ అధ్యక్షుడు వర్మ

పౌర గ్రంథాలయంలో క్విజ్ పోటీ

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు గురువారం గ్రంథాలయ సొసైటీ ఆధ్వర్యంలో క్విజ్ పోటీ నిర్వహించారు. 70 మంది విద్యార్థులు గ్రూపులుగా పాల్గొన్నారు. సమకాలీన అంశాలు, చరిత్ర, జాతీయ ఉద్యమం, శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఆర్థిక, రాజనీతి, భూగోళ శాస్త్రాలు మొదలైన విషయాలపై 70 ప్రశ్నలు అడిగారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. విజేతలకు పుస్తకాలను బహుమతిగా అందజేశారు.

నేత్రపర్వంగా ముత్యమాంబ పండగ

కంచరపాలెం: కంచరపాలెం మెట్టు కూడలిలో కొలువైన ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండగ గురువారం కనుల పండువగా జరిగింది. గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం గ్రామాధ్యక్షుడు భీశెట్టి వెంకటరావు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని మకర తోరణం, వెండి కిరీటం, ఏడువారాల నగలతో అలంకరించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. వేకువజాము నుంచే కంచరపాలెం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు ముత్యమాంబను దర్శించుకుని, మొక్కులు సమర్పించుకున్నారు. వారికి ఉత్సహ నిర్వాహకులు మజ్జిగ, శీతల పానీయాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, ఎమ్మెల్యే పి.గణబాబు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టబంగారం వద్ద నుంచి అమ్మవారి ప్రతిమలను ఆలయం వద్దకు చేర్చారు. అనంతరం ప్రతిమల అనుపోత్సవం ఘనంగా నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు భీశెట్టి వీరబాబు, పి.కె.వి.రమణ, పాలమరశెట్టి రాజు, రామకృష్ణ కాళ్ల రామారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్–8లో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. గవర్నమెంట్ రైల్వే పోలీస్(జీఆర్పీ) ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా.. గురువారం ఉదయం 5.45 గంటల ప్రాంతంలో విశాఖ రైల్వేస్టేషన్ 8వ నంబర్ ప్లాట్‌ఫాంపై ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. ఏదో రైలు నుంచి జారిపడటం గానీ, లేదా రైలు ఎక్కుతున్న సమయంలో జారిపడటం వల్ల గానీ మరణించి ఉండవచ్చు. మృతుడి వయసు సుమారు 30–35 ఏళ్లు ఉంటుంది. ఇతడి వద్ద ఏవిధమైన ఆధారాలు లేవు. ఈ వ్యక్తి పసుపు, తెలుపు రంగు టీ షర్ట్, కాఫీ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మెడలో నలుపు రంగు తాడు, కుడిచేతి మీద నాగుపాము, ఓంకార గుర్తులు పచ్చబొట్లు ఉన్నాయి. ఈ మృతదేహం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ వద్ద స్వయంగా గానీ లేదా 94406 27547, 98664 13487 నంబర్లలో తెలియజేయాలని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.



ప్లాట్‌ఫాం నంబర్–8లో వ్యక్తి మృతదేహం